## క్లుప్తంగా

### ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



తెయూ(డిచ్‌పల్లి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వర్సిటీ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని కేర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం నిర్వహించిన 'ఆరోగ్య అవగాహన సదస్సు'కు ఆయన హాజరయ్యారు. మానవులలో వివిధ రుగ్మతలు రావడానికి కారణాలు, వాటి నివారణ చర్యలను విద్యార్థులు వివరించారు. అధ్యాపకురాలు ఆస్మ ఫిర్‌దౌస్ లాంటి అధ్యాపకులు ఉంటే అద్భుతమైన విద్యార్థులను తయారు చేయవచ్చని చంద్రశేఖర్ ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, అధ్యాపకులు నరేశ్, సందేశ్, సందీప్, కొయ్యాడ శంకర్, విజయ్, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### అక్షర క్షిపణి అనిశెట్టి రజిత



నిజామాబాద్ రూరల్: ధిక్కారాన్ని, మమకారాన్ని సమయోచితంగా సంధించి సమాజాన్ని చైతన్య పరిచిన అక్షర క్షిపణి అనిశెట్టి రజిత అని తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అన్నారు. బుధవారం నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అనిశెట్టి రజిత సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ముందుగా కవులు రజిత చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆచార్య జయశంకర్ ప్రభావంతో ఉద్యమాలపై ఆసక్తిని పెంచుకొని తెలంగాణ ఉద్యమంలోను, అనేక సామాజిక ఉద్యమాలలో సారథ్య పాత్ర పోషించిన అనిశెట్టి రజిత ఉక్కు మహిళ అని దేవేందర్ అన్నారు. తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ.. రజిత కవిత్వం, వ్యక్తిత్వం రెండు ఆదర్శమేనని అన్నారు. కార్యక్రమంలో కవయిత్రి శారద, సీనియర్ న్యాయవాది ఆశ నారాయణ, తెరసం జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్ప ప్రసాద్, దొడ్డి హనుమాన్లు, ఇందూరు యువత అధ్యక్షుడు మద్దుకూరి సాయిబాబు, డాక్టర్ రాజశేఖర్, ఎంఏ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

### అవయవ దానంపై అవగాహన సదస్సు



నిజామాబాద్ నాగారం: జాతీయ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో నగరంలోని వాగ్దేవి జూనియర్ కళాశాలలో అవయవదాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పాకాల నరసింహారావు మాట్లాడుతూ.. మరో వ్యక్తికి పునర్జన్మను ప్రసాదించే ఈ అవయవ దానం చాలా గొప్పదని అన్నారు. డాక్టర్ అనంత కులకర్ణి అవయవదాన దినోత్సవ ప్రాధాన్యత గూర్చి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రెటరీ గంజి రమేశ్, మాజీ అధ్యక్షులు సృజన్ రెడ్డి, సూర్య ప్రకాశ్, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

#### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 101,200 | వెండి(కిలో) | 1,21,000 |
| 22 క్యారెట్స్ | 93,425 | – నిజామాబాద్ బిజినెస్ | |

#### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్డ్ | 160 |
| | | లైవ్ | 120 |
| స్కిన్‌లెస్ | 180 | మటన్ | 800 |

#### కూరగాయల ధరలు(రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 24 | 48 | గాజరుగడ్డ | 30 | 60 |
| బెండకాయ | 20 | 40 | పచ్చిమిర్చి | 30 | 60 |
| జీరకాయ | 15 | 30 | దోసకాయ | 20 | 40 |
| దొండకాయ | 30 | 60 | ఆలుగడ్డ | 20 | 40 |
| జెర్రిసుకాయ | 40 | 80 | గోబిగడ్డ | 15 | 30 |
| కాకరకాయ | 20 | 40 | గోబిపువ్వు | 25 | 50 |
| వంకాయ | 30 | 60 | బీట్‌రూట్ | 30 | 60 |
| పాలకూర | 20 | 40 | కరివేపాకు | 40 | 80 |
| మెంతికూర | 40 | 80 | చామగడ్డ | 40 | 80 |
| కొత్తిమీర | 20 | 40 | చిక్కుడుకాయ | 30 | 60 |
| పుదీనా | 30 | 60 | గోరుచిక్కుడు | 30 | 60 |
| క్యాప్సికం | 50 | 90 | | | |

–సుభాష్‌నగర్

# వర్షపు నీరు నిల్వకుండా చూడాలి



అహ్మద్‌పురా కాలనీలో డ్రెయినేజీలను పరిశీలిస్తున్న కమిషనర్ దిలీప్‌కుమార్



ఫ్రూట్ మార్కెట్ వద్ద నాలాను పరిశీలిస్తున్న కమిషనర్

- మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్
- లోతట్టు ప్రాంతాల పరిశీలన
- నాలాలు, డ్రెయినేజీల్లో చెత్త నిలవకుండా చూడాలని ఆదేశం

నిజామాబాద్ సిటీ: జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు, నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ సూచించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని పలు కాలనీల్లో ఉదయం 5 నుంచి 10 గంటల వరకు పర్యటించారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, శానిటేషన్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. లోతట్టు ప్రాంతాలు, పెద్ద నాలాలున్న ప్రాంతాలు, మురికివాడలను పరిశీలించారు. హమాల్‌వాడీ, గౌతంనగర్, కెనాల్ కట్ట, బంగారు మైసమ్మ కాలనీ, దుబ్బ, కొత్త కలెక్టరేట్, ఖానాపూర్ చౌరస్తా, అర్సపల్లి, అహ్మద్‌పుర కాలనీ, బోధన్ రోడ్డు, డి–54 కెనాల్, శివాజీనగర్ తదితర కాలనీల్లో పర్యటించి వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెద్ద నాలాల్లో చెత్త చేరకుండా, వెంటవెంటనే జేసీబీలతో తొలగింపజేయాలని ఈఈ మురళీమోహన్ రెడ్డికి సూచించారు. శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. పురాతన ఇళ్లలో ఉండేవారు వెంటనే సురక్షిత స్థావరాలకు వెళ్లాలన్నారు. నగరవాసులకు అత్యవసర సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 08462–221001 కేటాయించినట్లు కమిషనర్ తెలిపారు. అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# మొక్కజొన్న.. లాభాలు మిన్న



మనోహరాబాద్ శివారులో సాగవుతున్న మొక్కజొన్న



పడకల్‌లో పసుపులో అంతర పంటగా సాగవుతున్న మొక్కజొన్న పంట

- జక్రాన్‌పల్లిలో అత్యధికంగా సాగు
- డ్రిప్ విధానంలో..
- తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం

జక్రాన్‌పల్లి: మొక్కజొన్న రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. సాగులో అనుకున్న స్థాయిలో పంట దిగుబడి రావడంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. జక్రాన్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు ఎక్కువ సంఖ్యలో మొక్కజొన్న పంట సాగు చేస్తూ అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. డ్రిప్ పద్ధతిలో ఈ పంటను సాగు చేస్తున్నారు. ఈ పంట కేవలం 90 రోజుల్లోనే చేతికి వస్తుంది. మొక్కజొన్న తక్కువ కాల పరిమితి, స్థిరమైన ఆదాయం, చీడపీడల బెడద లేకుండా పంటలో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల రైతులకు పంట దిగుబడి బాగా వస్తుంది. రైతులు తక్కువ కాలంలోనే ఎక్కువ లాభాలు వచ్చే ఏకైక పంట మొక్కజొన్న. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తుండడంతో రైతులు ఈ పంటపై ఆసక్తి కనబరుస్తున్నారు. తక్కువ పెట్టుబడి సాగు సులభం కావడంతో రైతులు మొక్క జొన్న పంటకే మొగ్గు చూపుతున్నారు. మేలైన సాగు విధానంతో ఎకరానికి 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. వర్షాధారపు పంట కావడంతో ఖరీఫ్‌లో ఎక్కువగా రైతులు మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. పౌల్ట్రీ, ఇతరత్ర అవసరాలకు మొక్కజొన్నను ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీంతో మొక్కజొన్న పంటకు డిమాండ్ పెరిగింది. సాగు ఖర్చు తక్కువగా ఉండడం, కూలీల అవసరం లేకుండా మొక్కజొన్న పంటను సాగు చేసుకోవచ్చు. దీంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్నకే మొగ్గు చూపుతున్నారు. ఒక్కో ఎకరానికి రూ. 35 వేల నుంచి రూ. 40 వేల ధర పలుకుతోంది. మొదట్లో ఎకరానికి రూ. 50 వేలు పలుకగా ప్రస్తుతం ధర తగ్గింది. అదే చివరి వరకు మొక్కజొన్న పంటను సాగు చేస్తే క్వింటాలు మొక్కజొన్న రూ. 2300 పలుకుతుంది. ఈ లెక్కన ఎకరా దిగుబడికి రూ. 50 వేల నుంచి రూ. 60వేలు వచ్చే అవకాశం ఉంది. మండలంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పోరాటం

**రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి**



రామడుగు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి: ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ మరో పోరాటం చేస్తోందని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ధర్పల్లి మండలంలోని రామడుగు ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు కుడి, ఎడమ కాలువల ద్వారా బుధవారం నీటిని విడుదల చేశారు. ముందుగా ప్రాజెక్టు కట్టపై ఉన్న మైసమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓట్ల చోరీ అంశాన్ని లేవనెత్తడం సంతోషంగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు బీజేపీ అడ్డుపడుతోందని ఆరోపించారు. రామడుగు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నీరు లేకున్నా రైతుల సూచన మేరకు పంటలకు నష్టం కలగకుండా అధికారులతో చర్చించి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. అవసరం మేరకే నీటిని వాడుకోవాలని రైతులకు సూచించారు. రైతులు, నాయకులు ఆర్మూర్ బాలరాజు, ఆనంద్, రాజు, శంకర్, గంగారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నిజామాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని కాలూర్ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అగ్గు భోజన్న అన్నారు. బుధవారం కాలూరు గ్రామంలో 180 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేళ్లలో అధికారంలో ఉన్నా రేషన్‌కార్డులను మంజూరు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన చేపట్టి నూతన రేషన్ కార్డులను మంజూరు చేస్తోందని అన్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. రూరల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, బీఎల్ నరేందర్, బాగా రెడ్డి, అగ్గు నారాయణ, నరేందర్, గ్రామస్తులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు



ఇందల్వాయి: ఇందల్వాయి గ్రామంలోని ప్రసిద్ధ రామాలయ అభివృద్ధి, రాజగోపుర నిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి రూ. 25 లక్షల నిధులు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్ బుధవారం తెలిపారు. నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను గ్రామస్తులకు ఎమ్మెల్యే అందించారు. పీఏసీఎస్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, వీడీసీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

### నిధుల మంజూరుకు వినతి



సిరికొండ: మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే అంగడి ప్రదేశంలో షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు బీజేపీ మండల నాయకులు విన్నవించారు. జిల్లా కేంద్రంలో ఎంపీని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలు, దండలకు బదులు పేద పిల్లలకు అందించడానికి నోటు పుస్తకాలను వారు ఎంపీకి అందించారు. మార్కెట్ షెడ్డు నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని వారు తెలిపారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ధర్పల్లి బాబురావు, కనగందుల గోపి, బచ్చు మారుతి, వావిలాల అజయ్, కామాని కిరణ్, గాందారి రవి తదితరులు పాల్గొన్నారు.

## గణేశ్ మండపాలతో అంతరాయం కలుగవద్దు



గణేశ మండపాల నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ వినోద్

డిచ్‌పల్లి: గణేశ్ మండపాలను రోడ్లపై పూర్తిగా అడ్డుగా పెట్టకూడదని, అంబులెన్స్‌కు దారి ఉండేలా నిర్వాహకులు జాగ్రత్త తీసుకోవాలని డిచ్‌పల్లి సీఐ వినోద్ సూచించారు. బుధవారం డిచ్‌పల్లి పీఎస్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గణేశ్ మండపాల నిర్వాహకులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో సీఐ పలు సూచనలు చేశారు. గణేశ్ మండపాలకు విద్యుత్ సరఫరా సంబంధిత లైన్‌మన్ ద్వారా తీసుకోవాలన్నారు. ప్రతి మండపంలో రాత్రి పూట ఇద్దరు తప్పనిసరిగా నిద్రించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిమితికి మించి లౌడ్ స్పీకర్లను వినియోగించరాదని, డీజేలు పెట్టాలనుకుంటే ఏసీపీ ద్వారా అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. గణేశ్ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎండీ షరీఫ్, ఎస్సై–2 సుమన్, ఏఎస్సై ముంతాజ్, సిబ్బంది, గణేశ్ మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.


## 16న గీతా భవన్‌లో కృష్ణాష్టమి వేడుకలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని గీతా భవన్‌లో ఈ నెల 16న కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ భగవద్గీత కేంద్ర ప్రచార మండలి అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్. నరసింహ చార్యులు, మేడిచర్ల ప్రభాకర్ రావులు బుధవారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకం, గీత యజ్ఞం, విష్ణు సహస్రనామ నామ పారాయణం, భజన, ప్రముఖులచే ఉపన్యాసములు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు అరెట్టి లక్ష్మీనారాయణ, చంద్రశేఖర శర్మ, యోగా రామచంద్రం, ఇంజినీర్ గంగాధర్, బొడ్డు దయానంద్, జీఎం శంకర్, వెంకట స్వామి, షేర్ల దయానంద్, నరేందర్ రావు షిండే, భక్తులు పాల్గొన్నారు.

**మురళీకృష్ణ ఆలయంలో..**

నిజామాబాద్ రూరల్: నగరంలోని ఆర్మూర్ రోడ్డులో ఉన్న మురళీకృష్ణ ఆలయంలో ఈ నెల 16, 17వ తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. ప్రత్యేక కార్యక్రమాలు, భజనలు నిర్వహిస్తామని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ మహామేళా



మోపాల్‌లో మార్కింగ్ చేసిన అధికారులు

మోపాల్: మండలంలోని బైరాపూర్, చిన్నాపూర్, కులాస్‌పూర్, నర్సింగ్‌పల్లి, మోపాల్ తదితర గ్రామాల్లో కలెక్టర్ సూచనల మేరకు బుధవారం ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ మహామేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా 15 ఇళ్లకు అధికారులు మార్కింగ్‌తోపాటు భూమిపూజ చేశారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి గోవింద్‌రావు, ఎంపీడీవో రాములు నాయక్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతిఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. అదేవిధంగా డిచ్‌పల్లి మండలంలో కూడా ఇందిరమ్మ ఇళ్ల మార్కింగ్ మహామేళాను నిర్వహించినట్లు ఎంపీడీవో రాజ్‌వీర్ తెలిపారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### అత్యవసర కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో అత్యవసర కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో రాజేంద్ర కుమార్ తెలిపారు. 24 గంటల పాటు పనిచేసేందుకు పదిమంది సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా భారీ వర్షాల వల్ల అత్యవసర పరిస్థితి ఏర్పడితే తక్షణమే స్పందించడం, ఉన్నతాధికారులకు సమాచారం అందించడం, సహాయ చర్యలకు చేపట్టడం కొనసాగుతుందన్నారు. వర్షం, వాతావరణ పరిస్థితిని అంచనా వేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేసేందుకు సిద్ధంగా ఉంటారన్నారు. నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలో కంట్రోల్ రూమ్ నంబర్ 08462–295459ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

నందిపేట్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి అన్నారు. నందిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఎమ్మెల్యే బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అధ్యాపకుల హాజరు పట్టికను పరిశీలించారు. కళాశాలలో ఉన్న వసతులు, విద్యార్థులకు అందిస్తున్న బోధన గురించి ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురిస్తే కళాశాల భవనం చుట్టూ నీరు చేరుతోందని విద్యార్థులు, అధ్యాపకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు పటేల్ రాజు, నాయకులు నాగసురేశ్, పెయింటర్ రాజు, నవీన్, రవి ఉన్నారు.

### కార్మికులపై నిర్లక్ష్యం తగదు



జీపీ ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కూలీలు

సిరికొండ: వ్యవసాయ కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్ విమర్శించారు. మండలంలోని తూంపల్లి జీపీ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ధర్నా బుధవారం నిర్వహించారు. జీపీ కార్యదర్శి శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. మాస్‌లైన్ నాయకులు దామోదర్, రైతు సంఘం నాయకులు భూమాగౌడ్, కిశోర్, బాలిరెడ్డి, ఎర్రన్న, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



జక్రాన్‌పల్లి మోడల్ స్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



నల్లవెల్లిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై సందీప్

నిజామాబాద్‌అర్బన్/ జక్రాన్‌పల్లి/ ఇందల్వాయి: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్ మాదక ద్రవ్యాల నిర్మూలనపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలన పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాలిక్ రహమాన్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇందల్వాయి మండల కేంద్రంలోని నల్లవెల్లి హై స్కూల్‌లో ఇందల్వాయి పోలీసులు నాశముక్తా భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ఎస్సై సందీప్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కార్పొరేట్ సంస్థలు భారతదేశాన్ని వీడాలి



ధర్నాచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: భారతదేశం నుంచి కార్పొరేట్ శక్తులను తరిమికొట్టాలని ఐక్య వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద ఐక్య వామపక్ష నాయకులు క్విట్ కార్పొరేట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నదని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం భారతదేశం మొత్తాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని యత్నిస్తున్నదన్నారు. బీజేపీ కార్పొరేట్ అనుకూల విధానాలు మార్చుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దివెంకట్ రాములు, రమేశ్‌బాబు, వెంకటేశ్, వేల్పూర్ భూమయ్య, కంజెర భూమయ్య, నూర్జహాన్, సుధాకర్ పాల్గొన్నారు.

### బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలి



నిజామాబాద్ సిటీ: ప్రత్యేక తెలంగాణ కోసం చేసిన ఉద్యమం తరహాలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధనకు ఉద్యమించాలని బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ అన్నారు. దేశ జనాభాలో 60శాతం వరకు ఉన్న బీసీ కులాల ప్రజలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేసే వరకు ప్రత్యేక తరహాలో ఉద్యమించాలన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బీసీనని చెప్పుకునే ప్రధాని మోదీ బీసీ కులాల ప్రజలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగంలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టం చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ మేత్రి రాజశేఖర్, నర్సింహులు గౌడ్, డి.సంజీవ్, సబ్బని లత, కె.శ్రీనివాస్, అనిల్ కుమార్, రాంచందర్, చంద్రా గౌడ్ పాల్గొన్నారు.

### ఫెడరల్ క్యాస్ట్రో స్ఫూర్తితో పోరాటాలు చేయాలి



నిజామాబాద్ సిటీ: సామ్రాజ్యవాదం, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయడమే ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు, క్యూబా సోషలిస్ట్ వ్యవస్థ నిర్మాత ఫెడరల్ క్యాస్ట్రోకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడ సీపీఎం కార్యాలయంలో ఫెడరల్ క్యాస్ట్రో 79వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ.. ఫెడరల్ క్యాస్ట్రో తన సహచరుడైన చేగువేరా తో కలిసి అనేక దేశాల్లో పర్యటించి కమ్యూనిస్టు భావజాలాన్ని వ్యాప్తి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, వెంకటేశ్, సుజాత, విఘ్నేశ్, అనిత, రాజు, చక్రి పాల్గొన్నారు.